


DD9 వార్త
తెలుగు దినపత్రిక

**నాని డేట్స్ కోసం దర్శకుల పోరాటం..**
## ఆ లుక్ మారే వరకు 'రోమియో' రానట్లే!




సంపుటి : 02 సంచిక : 235 | హైదరాబాద్, ఏప్రిల్, బుధవారం 15, 2026 | పేజీలు : 06 వెల : 3.00

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ



**ఏప్రిల్ 20న కేసీఆర్ అధ్యక్షతన జగిత్యాలలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు కేటీఆర్ వెల్లడి**

**ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించబోతున్నట్టు ప్రకటన**

**మే, జూన్ నెలల్లో ప్రత్యక్ష పోరాటాలను ప్రారంభించనున్నట్టు వెల్లడి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరు కానున్నారని ..మిగతా 2లో

# అర్థంలేని విమర్శలు ఎందుకు?

**తెలుగు ప్రజలను కాంగ్రెస్ పార్టీయే బంట్రోతులుగా చూసింది**

**అంజయ్యకు జరిగిన అవమానం ఎవరూ మర్చిపోరు**

**గతంలో ఉత్తరాదికి ఎక్కువ సీట్లు కేటాయించింది మీరు కాదా?**

**కాంగ్రెస్ నేతల విమర్శలపై కిషన్ రెడ్డి ఫైర్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దక్షిణాది నుంచి కేంద్ర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం దక్కడం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గత 12 ఏళ్లలో దక్షిణాది నుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులను, దక్షిణాది నాయకులను వేర్వేరు రాష్ట్రాల నుంచి రాజ్యసభకు పంపించి కేంద్రమంత్రులు చేసిన ఘనత బీజేపీదని వివరించారు. రాహుల్ గాంధీ ఎందుకు యూపీ వదిలిపెట్టి కేరళకు వెళ్లారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. అభిషేక్ సింఘ్వీ ఉత్తరాదిని వదిలిపెట్టి తెలంగాణకు ఎందుకొచ్చారని వీటికి కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. మనమంతా భారతీయులం, ఎవరైనా ఎక్కడి ..మిగతా 2లో



# ఆర్టీసీ సమ్మెపై స్పందించిన సర్కార్

**చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యం**

**ఈ నెల 22 నుంచి సమ్మెకు జేఏసీ పిలుపు**

**కార్మికులను అప్రమత్తం చేసిన మంత్రి**

**మూడు కీలక డిమాండ్లపై కమిటీ ఏర్పాటు**

**చర్చలకు ప్రభుత్వం సిద్ధమని హామీ**

**సమ్మె వల్ల ప్రజలకు ఇబ్బందులు అని హెచ్చరిక**

**ఎలక్ట్రిక్ బస్సులపై అపోహలు తొలగింపు**

**ఉద్యోగ భద్రతపై స్పష్టమైన భరోసా**

**సమస్యలు చెప్పేందుకు తలుపులు తెరిచిన ప్రభుత్వం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ఆర్టీసీలో సమ్మెకు దారితీసే పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆర్టీసీ జేఏసీ ఈ నెల 22 నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ఆలోచించాలని, చర్చల ..మిగతా 2లో

# బీహార్ ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

**నీతీశ్ కుమార్ రాజీనామాతో మారిన రాజకీయ దృశ్యం**

**బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కీలక నిర్ణయం**

**ఏకగ్రీవంగా నాయకుడిగా ఎంపికైన సమ్రాట్**

**ఎన్‌డీఏ బలం, ప్రభుత్వ స్థిరత్వంపై విశ్వాసం**

**బాధ్యతలు చేపట్టనున్న కొత్త ముఖ్యమంత్రి**

**ప్రజాసేవే లక్ష్యమని సమ్రాట్ వ్యాఖ్య**

**సాధారణ కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదుగుదల**

**వివిధ పార్టీల్లో అనుభవం, రాజకీయ ప్రయాణం ప్రత్యేకం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

బీహార్ రాజకీయాల్లో కొంతకాలంగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి నీతీశ్ కుమార్ రాజీనామా చేయడంతో కొత్త నాయకత్వంపై చర్చలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కీలక నిర్ణయం తీసుకుని సమ్రాట్ చౌధరీ పేరును ముఖ్యమంత్రిగా ఖరారు చేసింది. దీంతో రాష్ట్రంలో కొత్త రాజకీయ అధ్యాయం ప్రారంభమవుతోంది.పట్నాలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఈ నిర్ణయానికి వేదిక అయింది. ఎమ్మెల్యేలు అందరూ ..మిగతా 2లో

# అంబేద్కర్ మార్గంలో తెలంగాణ అభివృద్ధి



**అందరికీ సమాన అవకాశాలు దక్కాలి**

**గాంధీ, అంబేద్కర్ దేశ నిర్మాణానికి రెండు కళ్లు**

**పేద పిల్లలకు నాణ్యమైన విద్య నందించడమే మా లక్ష్యం**

**ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణంపై స్పెషల్ ఫోకస్**

**గత పదేండ్లు తెలంగాణ విధ్వంసం అయ్యింది**

**డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం**

**తెలంగాణ రాష్ట్రానికి కూడా ఎంతో నష్టం తప్పదు**

**మా అభ్యంతరాలు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశాం**

**అంబేద్కర్ జయంతి ఉత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంబేద్కర్ జయంతి సందర్భంగా సమాన అవకాశాల ప్రాముఖ్యతను మరోసారి ప్రస్తావించారు. దేశాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాలంటే సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలన్నదే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం, హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు.సీఎం తన ప్రసంగంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్‌లను దేశ నిర్మాణానికి రెండు కళ్లుగా అభివర్ణించారు. మహాత్మా గాంధీ అహింసా మార్గంలో రక్తపాతం లేకుండా స్వాతంత్ర్య సమరాన్ని విజయవంతం చేయగలమని ప్రపంచానికి చూపించారని చెప్పారు. అదే సమయంలో అంబేద్కర్ బలమైన రాజ్యాంగాన్ని రూపొందించి, ..మిగతా 2లో

## నోయిడా కార్మికుల అల్లర్లలో కుట్ర కోణం

**హింసాత్మకంగా మారిన నిరసనల ఘటన**

**వాహనాల దహనం, ఆస్తుల ధ్వంసంతో ఉద్రిక్తత**

**పాక్ లింక్ అనుమానంతో దర్యాప్తు వేగం**

**మంత్రి వ్యాఖ్యలు ఘటనకు కొత్త మలుపు**

**సీఎం స్పందన.. కార్మిక హక్కులకు భరోసా**

**అశాంతి సృష్టించేందుకు బాహ్య శక్తుల ప్రయత్నం?**

**కార్మికుల ప్రధాన డిమాండ్లపై ఆరా**

**చర్చల ద్వారా పరిష్కారం దిశగా ప్రయత్నాలు**




# డీలిమిటేషన్‌పై కొత్త చర్చలు

**దక్షిణాది నష్టాలపై కేంద్రం వివరణ**

**జనాభా ప్రాతిపదికపై సీట్ల పెంపుపై వివాదం**

**ప్రతి రాష్ట్రానికి 50 శాతం పెంపు ప్రతిపాదన**

**కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి విమర్శలు**

**డీలిమిటేషన్ ప్రక్రియపై కేంద్రం ప్రణాళిక**

**జనగణనకు ముందే కమిటీ ఏర్పాటు సంకేతాలు**

**మహిళా రిజర్వేషన్ల అమలుపై స్పష్టత**

**అభివృద్ధి సూచీ ఆధారంగా సీట్లపై ప్రశ్నలు**



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ అంశం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజన జనాభా ఆధారంగా చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే వాదనలు ఉన్న నేపథ్యంలో కేంద్రం కొత్త విధానాన్ని ముందుకు తెచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ..మిగతా 3లో

# మహిళా బిల్లు.. భారత ప్రజాస్వామ్యంలో కొత్త అడుగు

**మహిళలు మరింత వేగంగా ముందుకొస్తారు**

**వారి హక్కుల కోసం ప్రశ్నిస్తారు.. పోరాడుతారు..**

**చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగనుంది**

**మహిళా బిల్లు వీలైనంత త్వరగా అమలవ్వాలి**

**ఏ మాత్రం ఆలస్యం జరిగినా మహిళలు నష్టపోతారు**

**మహిళలు తమ హక్కుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదు**

**వారి హక్కులు వారే సాధించుకోవచ్చు**

**ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్**

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**

దేశ రాజకీయాల్లో మహిళల పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ప్రకటన చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, దీంతో భారత రాజ్యాంగ వ్యవస్థ మరింత దృఢంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశ మహిళలకు ఉద్దేశించి ఆయన రాసిన ఓ విస్తృత లేఖను 'ఎక్స్' వేదికగా పంచుకుంటూ ..మిగతా 2లో



## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.



## అంబేద్కర్ మార్గంలో తెలంగాణ అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలకు బలమైన పునాదులు వేశారని గుర్తుచేశారు. భారతదేశం ఒక శక్తివంతమైన, సమగ్ర దేశంగా ఎదగడానికి అంబేద్కర్ కృషి కీలకమైందని సీఎం అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా పేదల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. గతంలో లేనివిధంగా విద్యారంగంలో సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల స్థాయిని మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కూడా ఉత్తమ విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని సీఎం వెల్లడించారు. విద్య, నివాసం, క్రీడలు, వ్యక్తిత్వ వికాసం—ఆల్ ఇన్ వన్ విధానంలో ఈ పాఠశాలలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ విధానం అమలు అయితే తెలంగాణ విద్యారంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వాల పాలనపై కూడా సీఎం విమర్శలు గుప్పించారు. పదేళ్ల కాలంలో జరిగిన తప్పిదాలు, ఆర్థిక అసమర్థత రాష్ట్రానికి దీర్ఘకాలిక నష్టాన్ని కలిగించాయని అన్నారు. ఆ కాలాన్ని "విధ్వంస కాలం"గా అభివర్ణిస్తూ, ఆ నిర్ణయాల ప్రభావం వందేళ్లపాటు ఉంటుందని వ్యాఖ్యానించారు. గతంలో తీసుకున్న అప్పులు, ఆర్థిక నిర్వహణలో చేసిన లోపాలను సరిదిద్దుకుంటూ ప్రస్తుత ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

మహిళా సాధికారత అంశాన్ని కూడా సీఎం తన ప్రసంగంలో ప్రస్తావించారు. మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని గుర్తు చేశారు. అయితే లోక్‌సభలో కొన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం దేశ అభివృద్ధికి కీలకమని ఆయన పేర్కొన్నారు.

అలాగే దక్షిణాది రాష్ట్రాలపై జరుగుతున్న అన్యాయంపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) జరగవచ్చనే అంశంపై ఆయన అభ్యంతరం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేశాయని, దాని ఫలితంగా జనాభా వృద్ధి తగ్గిందని చెప్పారు. అయితే ఇప్పుడు అదే కారణంగా లోక్‌సభ సీట్లలో కోత పడే పరిస్థితి వస్తోందని పేర్కొన్నారు.



జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న రాష్ట్రాలకు ఇది అన్యాయమని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం సూచించిన విధానాలను అమలు చేస్తే, చివరికి నష్టపోయేది ఆ రాష్ట్రాలేనని ఆయన అన్నారు. తెలంగాణకు కలిగే నష్టంపై ఇప్పటికే తమ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసిందని వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు అన్ని వేదికలపై పోరాడతామని స్పష్టం చేశారు.

మొత్తంగా, అంబేద్కర్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించడం ద్వారా ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తోంది. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి వంటి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అంబేద్కర్ చూపిన మార్గంలోనే తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పాన్ని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు.

## మహిళా బిల్లు.. భారత ప్రజాస్వామ్యంలో కొత్త అడుగు

మొదటిపేజీ తరువాయి



ఈ విషయాలను వెల్లడించారు.

**మహిళల సాధికారతకు కేంద్రం కట్టుబాటు**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. విజ్ఞానం, సాంకేతికం, విద్య, క్రీడలు, వ్యాపారం వంటి రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని గుర్తుచేశారు. ఇదే సమయంలో చట్టసభల్లో కూడా వారి ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే మహిళల రిజర్వేషన్ అమలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించడం ద్వారా వారి గొంతుకను బలంగా వినిపించే అవకాశం కలుగుతుందని ప్రధాని చెప్పారు. ఇది కేవలం మహిళల హక్కుల పరిరక్షణ మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యగా ఆయన అభివర్ణించారు.

**'నారీ శక్తి వందన్'పై సవరణలు**

పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి మూడు రోజులపాటు జరగనున్న సమావేశాల్లో నారీ శక్తి వందన్ అధినియమ్ బిల్లుకు సంబంధించి కీలక సవరణలు ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ సవరణల ద్వారా చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఈ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరిగినా అది దేశ మహిళలకు అన్యాయం చేసినట్టే అవుతుందని ప్రధాని స్పష్టం చేశారు. అందుకే ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా దేశ పాలనలో సమతుల్యత ఏర్పడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**2029 ఎన్నికల నాటికి అమలు లక్ష్యం**

ప్రధాని తన లేఖలో కీలకంగా ప్రస్తావించిన అంశం—2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లను పూర్తిగా అమల్లోకి తీసుకురావడం. ఈ దిశగా అవసరమైన రాజ్యాంగ సవరణలు, పరిపాలనా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీని ద్వారా దేశ రాజకీయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. లోక్‌సభలో మొత్తం స్థానాల్లో మూడొంతులు మహిళలకు కేటాయించే విధంగా చట్టంలో మార్పులు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రతిపాదిత 816 లోక్‌సభ స్థానాల్లో సుమారు 273 సీట్లు మహిళలకు కేటాయించేలా ప్రణాళిక రూపొందించబడుతున్నట్లు సమాచారం. ఇది భారత రాజకీయ చరిత్రలో అతిపెద్ద సామాజిక న్యాయ చర్యల్లో ఒకటిగా భావిస్తున్నారు.

**మహిళల హక్కులపై ప్రధాని పిలుపు**

''భారతదేశ కుమార్తెలు తమ హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు'' అంటూ ప్రధాని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళల గొంతుక గట్టిగా వినిపించే సమయం వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా ఉన్న మహిళలను ఉద్దేశించి ఆయన ప్రత్యేక పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లుకు మద్దతు లభించేందుకు తమ తమ ప్రాంతాల ఎంపీలకు లేఖలు రాయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, ఈ చారిత్రాత్మక నిర్ణయానికి మహిళల ఆశీస్సులు అవసరమని పేర్కొన్నారు.

**2023లో బిల్లుకు శ్రీకారం**

గతంలో 2023లో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ బిల్లు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా ఇది కీలక అడుగుగా భావించారు. ప్రస్తుతం ఆ బిల్లులో సవరణలు చేపట్టడం ద్వారా అమలు ప్రక్రియను స్పష్టతతో ముందుకు తీసుకెళ్లాలని కేంద్రం భావిస్తోంది.

**రాజకీయ, సామాజిక ప్రాధాన్యం**

మహిళల రిజర్వేషన్ల అమలు దేశ రాజకీయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు దారి తీసే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు చట్టసభల్లో మహిళల శాతం తక్కువగా ఉండటం ఒక పెద్ద లోటుగా భావించబడింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే మహిళలకు అధిక అవకాశాలు లభించడంతో పాటు పాలనలో వారి దృష్టికోణం ప్రతిఫలించే అవకాశం ఉంటుంది. ఇది గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహిళల రాజకీయ చైతన్యాన్ని పెంచుతుందని విశ్లేషకులు అంటున్నారు. అలాగే మహిళల సమస్యలు, సంక్షేమ అంశాలు చట్టసభల్లో మరింత ప్రాముఖ్యత పొందే అవకాశముందని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే మహిళల రిజర్వేషన్ల అమలు దిశగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. సమాన హక్కులు, సమాన అవకాశాలు అనే రాజ్యాంగ విలువలను మరింత బలోపేతం చేసే ఈ నిర్ణయం అమల్లోకి వస్తే భారత ప్రజాస్వామ్యం కొత్త దశలోకి అడుగుపెట్టే అవకాశముంది. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లుకు సంబంధించిన సవరణలు ఎలా ఉంటాయి, వాటికి రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి మద్దతు లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## బీహార్ ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ

మొదటిపేజీ తరువాయి



కలిసి సమ్రాట్ చౌధరీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ సిన్హా ఆయన పేరును ప్రతిపాదించగా, ఇతర సభ్యులు మద్దతు తెలిపారు. ఎలాంటి విభేదాలు లేకుండా ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడం పార్టీ ఐక్యతకు నిదర్శనంగా భావిస్తున్నారు.

243 స్థానాలున్న బిహార్ అసెంబ్లీలో ఎన్‌డీఏకు బలమైన మెజారిటీ ఉంది. మొత్తం 202 మంది సభ్యుల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. అందులో బీజేపీకి 89 మంది ఎమ్మెల్యేలు ఉండటం పార్టీకి కీలక బలం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశం బీజేపీకి రావడం సహజంగా మారింది. సమ్రాట్ చౌధరీ ఎంపికతో ఈ సమీకరణం మరింత బలపడింది.

కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. అధికారిక కార్యక్రమం పట్నాలో జరగనుంది. ఈ మార్పు రాష్ట్ర పాలనలో కొత్త దిశను తీసుకువస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అభివృద్ధి, పరిపాలనలో వేగం పెరుగుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. తన ఎంపికపై స్పందించిన సమ్రాట్ చౌధరీ, ఇది కేవలం పదవి మాత్రమే కాదని అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తున్నానని చెప్పారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రతి నిర్ణయం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటానని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఈ బాధ్యత ఒక కీలక మలుపు అని పేర్కొన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ చూపిస్తున్న అభివృద్ధి దిశలోనే బిహార్‌ను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రజల ఆశలను నెరవేర్చడమే లక్ష్యమని వెల్లడించారు. గతంలో నీతీశ్ కుమార్ వద్ద నుంచి పరిపాలనపై చాలా నేర్చుకున్నానని కూడా గుర్తుచేశారు. సమ్రాట్ చౌధరీ రాజకీయ ప్రయాణం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, క్రమంగా ఉన్నతస్థాయికి చేరింది. ప్రజల మధ్య పని చేస్తూ, వివిధ స్థాయిల్లో అనుభవం సంపాదించారు. అనేక ఎన్నికల్లో పోటీ చేసి విజయాలు సాధిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రస్తుతం బిహార్ రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగారు.

అలాగే ఆయనకు రాజకీయంగా బలమైన కుటుంబ నేపథ్యం ఉంది. ఆయన తండ్రి శకుని చౌధరీ ప్రముఖ నాయకుడిగా పనిచేశారు. ఈ నేపథ్యం కూడా ఆయన ఎదుగుదలకు సహకరించింది. అయినప్పటికీ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం ఆయన ప్రత్యేకతగా చెప్పవచ్చు. మూడు ప్రధాన పార్టీల్లో పనిచేసిన అనుభవం కూడా సమ్రాట్ చౌధరీకి ఉంది. రాజకీయ జీవితాన్ని లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీలో ప్రారంభించారు. అనంతరం జేడీయూలో చేరి అక్కడ కూడా కీలక పాత్ర పోషించారు. చివరకు బీజేపీలో చేరి పార్టీకి ముఖ్య నాయకుడిగా మారారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. పరిపాలనా విషయాల్లో అవగాహన పెంచుకుని, ప్రభుత్వ వ్యవస్థపై పట్టుదల సాధించారు. ఈ అనుభవం ఇప్పుడు ముఖ్యమంత్రి బాధ్యతల్లో ఆయనకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. బిహార్‌లో సమ్రాట్ చౌధరీ ముఖ్యమంత్రిగా ఎంపిక కావడం రాజకీయంగా కీలక పరిణామం. ఇది రాష్ట్ర పాలనలో మార్పులకు నాంది పలుకుతుందా లేదా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. ప్రజల ఆశలు, పార్టీ లక్ష్యాలు - ఈ రెండింటినీ సమతుల్యం చేస్తూ ఆయన ముందుకు ఎలా సాగుతారన్నది ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## బరంగేడ్గిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**బీర్కూర్, ఏప్రిల్ 14(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని బరంగేడిగి గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు, యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం "జై భీమ్" నినాదాలతో గ్రామం మారుమోగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గైని హనుమంతు, ఉపాధ్యక్షులు పోతురాజు శివకుమార్, ఉపాధ్యక్షుడు అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి గైని సంతోష్, కార్యదర్శి నీరడి గంగాధర్, కోశాధికారి సందుల సాయిలు పెద్ద, సలహాదారులు మచికూరి లక్ష్మణ్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ ఆశయాలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.



## అర్థంలేని విమర్శలు ఎందుకు?

మొదటిపేజీ తరువాయి



నుంచైనా ఎంపిక కావొచ్చని అన్నారు. అర్థంలేని విమర్శలతో కోడిగుడ్డు మీద ఈకలు పీకడం సరికాదని చురకలంటించారు. ఢిల్లీ నుంచి ఒక్క ఫోన్ కాల్‌తో ఇష్టారాజ్యంగా ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రులను మార్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందని, విమానాశ్రయంలో మాజీ ముఖ్యమంత్రి అంజయ్యని ఎలా అవమానించారో ప్రజలు మర్చిపోరని కిషన్ రెడ్డి అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి నష్టమని భావించే మోదీ కొత్త ప్రతిపాదన చేశారని తెలిపారు. గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. ఏ పార్టీ అధికారంలో ఉండాలనేది అంతిమంగా ప్రజలు నిర్ణయిస్తారని, ఏ రాష్ట్రానికీ నష్టం జరగకూడదనే 50 శాతం నిష్పత్తిలో పెంచుతున్నారని వివరించారు. జనగణన పూర్తి కావడానికి చాలా సమయం పడుతుందని, ఈసారి కులగణన కూడా చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు.

## ఆర్టీసీ సమ్మెపై స్పందించిన సర్కార్

మొదటిపేజీ తరువాయి



ద్వారానే సమస్యలకు పరిష్కారం కనుగొనాలని ఆయన సూచించారు.

మంత్రి మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల్లో కొందరిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని రాజకీయ అనుబంధ గుంపులు, రిటైర్డ్ ఉద్యోగులు సమ్మెకు ప్రేరేపిస్తున్నారని అన్నారు. అలాంటి ప్రభావాలకు లోనుకాకుండా ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. తమ సమస్యలు నిజంగా ఉంటే నేరుగా ప్రభుత్వాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. ఆర్టీసీ కార్మికులు ఉంచిన ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకుండా లేదు అని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ కమిటీ సమస్యలను విశ్లేషిస్తూ, సాధ్యమైన పరిష్కారాలపై పని చేస్తోందని వివరించారు. అవసరమైతే ఆర్థిక శాఖతో కలిసి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించేందుకు తాను కూడా సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.

సమ్మె వల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. పల్లెల్లో రవాణా సౌకర్యాలు తగ్గిపోతే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇబ్బంది పడతారని చెప్పారు. అందుకే ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మె నిర్ణయాన్ని పునరాలోచించాలని కార్మికులను కోరారు. తాను కూడా ఒకప్పుడు ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తినేనని, కార్మికుల భావాలు తనకు తెలుసని మంత్రి అన్నారు. ఆర్టీసీ అంటే తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో కార్మికులు సమ్మె చేసినప్పుడు వారిని అణచివేసిన ఘటనలను గుర్తుచేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానాన్ని అనుసరించదని స్పష్టం చేశారు.

ఎలక్ట్రిక్ బస్సుల అంశంపై కూడా మంత్రి స్పందించారు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద ఈవీ బస్సులు తీసుకొస్తున్నామని, ఇది సంస్థ అభివృద్ధికి ఉపయోగపడుతుందని చెప్పారు. అయితే దీనిపై అనవసరమైన అపోహలు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులు రావడం వల్ల ఉద్యోగాలు పోతాయని ప్రచారం జరుగుతున్నా, అది పూర్తిగా తప్పు అని పేర్కొన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి భద్రత ఉందని మంత్రి హామీ ఇచ్చారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉద్యోగాలపై ప్రభావం ఉండదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. సంస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

కార్మికుల సమస్యలను వినేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ విలీనం, యూనియన్‌ల అంశాలు కూడా ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయని చెప్పారు. ఈ అంశాలపై కూడా కమిటీ పనిచేస్తోందని, త్వరలో స్పష్టత వస్తుందని సూచించారు. ఎవరైనా ఉద్యోగి తన సమస్యను చెప్పాలనుకుంటే నేరుగా వచ్చి చెప్పవచ్చని, తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం చర్చల ద్వారానే ముందుకు సాగాలనే వైఖరిని వ్యక్తం చేసింది. కార్మికులు కూడా సమ్మె మార్గం కాకుండా సంభాషణ మార్గాన్ని ఎంచుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. ఇక జేఏసీ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# డీలిమిటేషన్‌పై కొత్త చర్చలు

మొదటిపేజీ తరువాయి



తెలిపారు. గతంలో ఈ అంశంపై రాజకీయ పార్టీల మధ్య విభేదాలు తీవ్రంగా ఉన్నాయని గుర్తుచేసిన ఆయన, ఇప్పుడు సమతుల్య దృష్టితో ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.జనాభా ఆధారంగా సీట్లు పెంచితే ఉత్తరాది రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యం లభిస్తుందని దక్షిణాది రాష్ట్రాలు గతంలో ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ప్రతి రాష్ట్రానికి సమానంగా 50 శాతం సీట్లు పెంచే ప్రతిపాదనను కేంద్రం పరిశీలిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ విధానం ద్వారా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీపై కూడా మంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది అదే పార్టీ కాదా అని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల నాయకులను కాంగ్రెస్ పార్టీ ఎలా చూడిందో ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి.డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా కేంద్రం తన దిశను వెల్లడించింది. జనగణన పూర్తయ్యే వరకు వేచి చూస్తే ప్రక్రియ ఆలస్యమవుతుందని భావించి ముందుగానే కమిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

కొత్త నియోజకవర్గాల సరిహద్దులు నిర్ణయించడం సమయం తీసుకునే ప్రక్రియ కాబట్టి ముందస్తు చర్యలు అవసరమని చెప్పారు.

అలాగే జనగణన, కులగణన ప్రక్రియలకు ఇంకా ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కారణంగా అన్ని ప్రక్రియలు 2029 ఎన్నికలకల్లా పూర్తవుతాయా అన్నది అనుమానంగా ఉందని అన్నారు. అయినప్పటికీ మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడంపై కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే నిధుల విషయంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వం కీలక మార్పులు తీసుకువచ్చిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రాల వాటాను గణనీయంగా పెంచినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రం రాష్ట్రాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు.

ఇక తెలంగాణ రాజకీయాలపై కూడా మంత్రి స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. అభివృద్ధి సూచీ ఆధారంగా సీట్లు పెంచాలన్న ప్రతిపాదన వాస్తవ పరిస్థితులకు సరిపోదని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి విధానం లేదని వ్యాఖ్యానించారు.అభివృద్ధి సూచీ ఆధారంగా వెళ్తే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గి, పట్టణ ప్రాంతాల్లో పెరిగే పరిస్థితి వస్తుందని చెప్పారు. దీంతో ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

రాజకీయంగా కూడా పరస్పర ఆరోపణలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ నాయకత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు చేయగా, బీజేపీ విధానాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. ఈ పరిస్థితుల్లో డీలిమిటేషన్ అంశం రాబోయే రోజుల్లో మరింత ప్రాధాన్యం పొందే అవకాశముంది.నియోజకవర్గాల పునర్విభజన అంశం దేశ రాజకీయాల్లో కీలక చర్చగా మారింది. కేంద్రం ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు విధానం అన్ని రాష్ట్రాలకు సమానంగా ఉపయోగపడుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ ఈ అంశంపై రాజకీయ పార్టీల మధ్య చర్చలు, వాదనలు మరింత వేగం పుంజుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

# నోయిడా కార్మికుల అల్లర్లలో కుట్ర కోణం

- హింసాత్మకంగా మారిన నిరసనల ఘటన
- వాహనాల దహనం, ఆస్తుల ధ్వంసంతో ఉద్రిక్తత
- పాక్ లింక్ అనుమానంతో దర్యాప్తు వేగం
- మంత్రి వ్యాఖ్యలు ఘటనకు కొత్త మలుపు
- సీఎం స్పందన.. కార్మిక హక్కులకు భరోసా
- అశాంతి సృష్టించేందుకు బాహ్య శక్తుల ప్రయత్నం?
- కార్మికుల ప్రధాన డిమాండ్లపై ఆరా
- చర్చల ద్వారా పరిష్కారం దిశగా ప్రయత్నాలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఇటీవల చోటుచేసుకున్న కార్మికుల ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. మొదట కనీస వేతనాల అమలు కోసం ప్రారంభమైన ఈ నిరసనలు ఒక్కసారిగా హింసాత్మక రూపం దాల్చడంతో పరిస్థితి అదుపుతప్పింది. పరిశ్రమల ముందు భారీగా గుమికూడిన కార్మికులు రాళ్లు విసురుతూ అల్లర్లు సృష్టించారు. కొన్ని ప్రాంతాల్లో వాహనాలకు నిప్పు పెట్టడంతో పాటు ఆస్తులను ధ్వంసం చేయడం వల్ల అక్కడి పరిస్థితి తీవ్రంగా మారింది. ఫేజ్ 2, సెక్టర్ 60, 62, 84 ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా కనిపించింది.

ఈ ఘటనల కారణంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగినా, కొంతసేపు పరిస్థితి నియంత్రణలోకి రావడానికి సమయం పట్టింది. అల్లర్ల నేపథ్యంలో భారీగా భద్రతా బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.ఈ ఘటనకు సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కుట్ర కోణాన్ని పరిశీలిస్తోంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ ఈ సంఘటన సాధారణ నిరసన కాదని, ముందుగానే ప్రణాళికతో జరిగి ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఇటీవల మీరట్, నోయిడా ప్రాంతాల్లో ఉగ్రవాద అనుమానితులను అరెస్టు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, వారికి విదేశీ సంబంధాలు ఉన్నట్లు సమాచారం ఉన్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ అల్లర్ల వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉండే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

రాష్ట్రంలో అస్థిరత సృష్టించడం లక్ష్యంగా కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయనే అనుమానాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు లేదా నెట్వర్క్‌లతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. దీనిపై స్పష్టత కోసం పోలీసులు అన్ని ఆధారాలను సేకరిస్తున్నారు. ఎలాంటి కోణాన్ని వదలకుండా విచారణ జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా స్పందించారు. కార్మికుల హక్కులను ప్రభుత్వం కచ్చితంగా పరిరక్షిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. పరిశ్రమలు చట్టాలను పాటించాలని స్పష్టం చేశారు. అయితే కొందరు కావాలనే కార్మికులను రెచ్చగొడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.

అల్లర్ల సమయంలో ముఖ్యమంత్రి ముజఫర్‌నగర్ పర్యటన కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ ఘటన ఆ పర్యటనను భంగపరచడానికే జరిగి ఉండొచ్చని కొందరు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అశాంతి సృష్టించడానికి కుట్ర పన్నబడిందా అనే దానిపై దర్యాప్తు మరింత లోతుగా కొనసాగుతోంది. ఈ అంశం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది.ఇక కార్మికులు మాత్రం తమ డిమాండ్లపై వెనక్కి తగ్గడం లేదు. కనీస వేతనాల పెంపు, పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు, అవసరమైన సదుపాయాల కల్పన, వారాంతపు సెలవులు వంటి అంశాలను వారు ప్రధానంగా కోరుతున్నారు. ఇటీవల హరియాణాలో కార్మికులకు వేతనాలు పెంచిన నేపథ్యంలో, అదే విధానాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా వెనక్కి తగ్గబోమని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులను నోయిడాకు పంపింది. వారు కార్మికులతో



నేరుగా చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్రిక్తతను తగ్గించేందుకు శాంతి చర్చలు కీలకంగా మారాయి. కార్మికులు ఎలాంటి వదంతులను నమ్మకుండా సహనం పాటించాలని ప్రభుత్వం కోరుతోంది. హింసతో సమస్యలు పరిష్కారం కావని, చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం నోయిడాలో పరిస్థితి కొంతవరకు అదుపులోకి వచ్చినప్పటికీ, ఇంకా ఉద్రిక్తత పూర్తిగా తగ్గలేదు. పోలీసులు, పరిపాలనా యంత్రాంగం పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్మికులతో కొనసాగుతున్న చర్చలు ఫలిస్తే పరిస్థితి త్వరలో సాధారణ స్థితికి చేరే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అయితే కుట్ర కోణంపై వస్తున్న అనుమానాలు ఈ ఘటనను మరింత ప్రాధాన్యమైన అంశంగా మార్చాయి.



# ఘనంగా బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి

**నిజామాబాద్ పోతంగల్, ఏప్రిల్ 14(డిడి9వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని కోడిచర్ల గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కవిత ఈర్వంత్ మాట్లాడుతూ భీమ్రావు రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ లోని మహూ అనే గ్రామం లో రాంజీ మాలోజీ సక్పాల్ బీమాబాయ్ దంపతులకు జన్మించారు అసలు పేరు భీమారావు రంజి అంబావడేకర్ వీరు మరాఠీ నేపథ్యం కలవారు ఆరేళ్ల వయసులోనే తల్లి చనిపోయింది.బాల్యం నుండే బాబాసాహెబ్ ను కుల వివక్ష వెంటాడుతూనే ఉంది బాబాసాహెబ్ ఒక్క కులానికి పరిమితం కాదు అన్ని కులాలకు సమానంగా చూసిన మహనీయుడు అందరు బాబాసాహెబ్ అడుగు జాడల్లో నడవాలని చెప్పారు కార్యక్రమం లో సంఘం అధ్యక్షులు ప్రకాష్ ఉపాధ్యక్షలు రాములు సంఘం సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా అంబేద్కర్ జయంతి

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

భారతదేశంలో ప్రతి ఒక్కరికి రాజ్యాంగ హక్కులు దక్కేల ఎనలేని కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి మస్కే మాధవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ స్వతంత్ర భారత పునాది నేటి భారతదేశానికి దిక్సూచి బుద్దిగమన మార్గదర్శి భవిష్యత్తు తరాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసిన అంబేద్కర్ దేశానికి గర్వకారణమని అన్నారు. చురుకైన సంఘసంస్కర్త గా ప్రముఖ న్యాయవాదిగా చిరస్మరణీయుడనీ కొనియాడారు. యువకులు అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని ఆయనలాగా ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామంలో ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చిత్రపటంతో యువకులు మహిళలు ఊరేగింపు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆడే శీలా, బిజెపి మండల అధ్యక్షుడు కేంద్రే శివ,మాధవ్ ససానే, అడ్వకేట్ అజయ్ జోందళే, సిద్ధార్థ్ ససానే, కిషన్ బుద్దే,నరహరి బుద్దే,మతంకర్ శంకర్ , తిరుమల గౌడ్,పవార్ రవీందర్ నాయక్,రమేష్ జాదవ్ ,వామన్ గిత్తే,శైలేందర్ వాగ్మారే, ఆడే జైపాల్, రాజేంద్రప్రసాద్ జునుగురు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# టాక్లి గ్రామంలో వి135వ ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతి వేడుకలు

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం కమిటీ తరపున మెడికవర్ ఆసుపత్రి నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు
- టాక్లి గ్రామ సర్పంచ్ పద్మావతి సాయి కిరణ్

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 14 (డిడి9 వార్త):**

నిజామాబాద్ పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ పద్మావతి సాయి కిరణ్ వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి నవభారత నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ. బాబాసాహెబ్ కటిక చీకటిని చీల్చుకుంటూ వచ్చిన జ్ఞానోదయం ఆయన కోట్లాది గొంతుకులకు లభించిన మహా వాక్యం ఆయన అణిచివేత సంకెళ్లను తెంచిన వజ్రాయుధం సమాసమాజ నిర్మాణానికి వేసిన బలమైన పునాది వేల ఏళ్ల అంటరానితనంపై గర్జించిన సింహం అక్షరమే ఆయుధంగా అజ్ఞానాన్ని తరిమిన మేధావి కులమతాల వీళ్లను పెకిలించిన విప్లవకారుడు భారత రాజ్యాంగానికి ప్రాణం పోసిన ప్రజాస్వామ్య విధాత చదువుకో సంఘటించు పోరాడు అని పిలుపునిచ్చి ఆత్మ గౌరవ శిఖరాన నిలబెట్టిన మహా మనిషి అని అన్నారు. గ్రామ సర్పంచ్ పద్మావతి సాయికిరణ్, ఈ కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ కూడా చేయడం జరిగింది. అదేవిధంగా నిజామాబాద్ మెడికవర్ ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా గ్రామ ప్రజలు ఆధార్ కార్డు తీసుకొని వచ్చి వాళ్లకున్న సమస్యలను తెలిపి చికిత్స చేయించుకోవడం జరిగింది. ఆసుపత్రి సిబ్బంది బిపి షుగర్ థైరాయిడ్ కీళ్ల నొప్పులు మరియు వాళ్లకు ఉన్న సమస్యలను తెలుసుకొని ఉచిత ఔషధాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మావతి సాయికిరణ్ ఉపసర్పంచ్ కాంబ్లె సురేఖ జ్యోతి పాల్ అంబేద్కర్ కమిటీ సభ్యులు కాంబ్లె ప్రకాష్. గంగాధర్. శంకర్. కార్తీక్ సందీప్. రాహుల్. ప్రహ్లాద్. శివ. పోచయ్య. చాందు. మధు. గౌతమ్. చంటి. చింటూ. గంగారాం. సోంపూర్ సర్పంచ్ పవర్ సంజు పాటిల్. మెడికవర్ ఆసుపత్రి నిజామాబాద్ డాక్టర్ అజయ్ కుమార్ నెఫ్రాలజిస్ట్. డాక్టర్ మనోజ్ కుమార్ జనరల్ సర్జన్. సాయి చరణ్. వంశీ కృష్ణ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల బాధ్యత కీలకం

- శ్రీ వేద హై స్కూల్ కోటగిరి

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 14 (డిడి9 వార్త):**




నిజామాబాద్ కోటగిరి మండలంలోని శ్రీవేద హై స్కూల్ అన్యువల్ డే ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీహరి విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత కీలకమె తల్లిదండ్రుల బాధ్యత కూడా అంతే కీలకమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీహరి అన్నారు శ్రీ వేద పాఠశాల 11వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు నేటి సమాజంలో విద్యార్థులు చదువులకు దూరం కావడం చెడు అలవాట్లకు దగ్గర కావడం పరిపాటిగా మారింది అని ఆయన అన్నారు విద్యార్థులను తల్లిదండ్రులు ప్రశంసించాలి కానీ పొగడకూడదని దీనివల్ల విద్యార్థులలో తప్పుడు అభిప్రాయాలు ఏర్పడతాయని ఆయన అన్నారు విద్యార్థులకు చదువు క్రమశిక్షణ రెండు ఎంతో ముఖ్యమని అవి రెండు ఉన్నవారు మాత్రమే తమ లక్ష్యాలను చేరుకోగలుగుతారని ఆయన అన్నారు ఇందుకు నిదర్శనం సచిన్ టెండూల్కర్ అని వివరించారు 32 సార్లు సెంచరీలు చేసిన 33 వ సారి సున్నా రన్స్ కు వికెట్ కోల్పోయినప్పుడు తలదించుకొని వచ్చిన వ్యక్తి అని గుర్తు చేశారు తల్లిదండ్రులు గురువులు మందలించిన చిన్నారుల భవిష్యత్తు కోసమేనని గుర్తు చేశారు నేటి సమాజంలో ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలంటేనే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు ఉపాధ్యాయులకు సొంత పిల్లల కన్నా పాఠశాల చిన్నారులే ముఖ్యమని వారిని సైతం తమ పిల్లలుగానే భావిస్తారని ఇందుకు ఎన్నో ఉదాహరణలు చెప్పుకొచ్చారు నేటి సమాజంలో తల్లిదండ్రులు గురువుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని విద్యార్థుల ముందే గురువులను అగౌరవపరుస్తున్నారని ఇది మంచి సంస్కృతి కాదన్నారు విద్యార్థులకు చదువులు గురువులు విద్యాసంస్థలు అన్న విలువలు పోవడానికి కారణం ఇలాంటి ఘటనలేనని ఆయన గుర్తు చేశారు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో మేధాసంపత్తి ఉంటుందని చెప్పుకొచ్చారు పట్టణాలలోని విద్యాసంస్థలతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల విద్యాసంస్థలే మెరుగైన విద్యను వ్యక్తిత్వంతో కూడిన విద్యను విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాయని గుర్తు చేశారు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సునీల్ బోధన్ విద్యా వికాస్ విద్యా సంస్థల చైర్మన్ యార్లగడ్డ శ్రీనివాస్ ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్ రావు శ్రీ వేద పాఠశాల డైరెక్టర్ తెల్ల రవికుమార్ కరస్పాండెంట్ తెల్ల అక్షర ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు



# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : డిడి9 వార్త న్యూస్**



భారతదేశంలో ప్రతి ఒక్కరికి రాజ్యాంగ హక్కులు దక్కేల ఎనలేని కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు బజార్హతన్నూర్ మండలం వర్తమాన్నూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు స్వతంత్ర భారత పునాది నేటి భారతదేశానికి దిక్సూచి బుద్దిగమన మార్గదర్శి భవిష్యత్తు తరాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు భారత రాజ్యాంగానికి రూపకల్పన చేసిన అంబేద్కర్ దేశానికి గర్వకారణమని అన్నారు.చురుకైన సంఘసంస్కర్త గా ప్రముఖ న్యాయవాదిగా చిరస్మరణీయుడనీ కొనియాడారు.యువకులు అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని ఆయనలాగా ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామంలో ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చిత్రపటంతో యువకులు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగాఅంబేద్కర్ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ యాదవ్
- అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు
- సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి: నగేష్ యాదవ్

**శామీర్ పేట,ఏప్రిల్ 14,(డిడి9 వార్త)**





తుంకుంట మున్సిపల్ పరిధిలోని మందయిపల్లి చౌరస్తా వద్ద మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమాన హక్కులు, న్యాయం సాధించడంలో అంబేద్కర్ ఆలోచనలు ఎంతో ప్రాముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కత్తి రమేష్, చీరాలగిరి, మాజీ వార్డ్ సభ్యులు టి.ఆర్. రవీందర్ గౌడ్, పరంది శ్రీనివాస్, కత్తి వెంకటేష్, కత్తి జగన్, మోత్కుల మల్లేష్ యాదవ్, గుంటల రాంరెడ్డి, పరందిరాజు, వీరభ్రమ చారి, ప్రవీణ్ గౌడ్, కత్తిబాబు, కత్తి మధు తదితరులు పాల్గొన్నారు.




## చరిత్రలోనే శాశ్వత స్థానం సంపాదించిన మహా మేధావి అంబేద్కర్

- గోవిందాపురం గ్రామ సర్పంచ్ మందా కరుణ

**బోనకల్,ఏప్రిల్ 14,(డీడీ9 వార్త):**

మండల పరిధిలో గోవిందాపురం ఎల్ గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,135 వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ సర్పంచ్ మందా కరుణ, అంబేద్కర్, చిత్రపటానికి పూలు మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతదేశ చరిత్రలో గొప్ప వ్యక్తి, మహా మేధావన్నారు,భారత రాజ్యాంగ రూపకర్తగా ప్రసిద్ధి చెందిన మహానుభావుడన్నారు,ఆయన దళితులు,అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అని అంబేద్కర్ కుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని, మను స్మృతి వంటి గ్రంథాలను తిరస్కరించాలని పిలుపునిచ్చారన్నారు. దళితుల హక్కుల కోసం పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కు నివాళులర్పించిన వారిలో ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, వార్డ్ మెంబర్ జట్టెం వీరబాబు, ముత్తారపు రవి, షేక్ సైదా, కళ్యాణపు శ్రీనివాసరావు, మందా సత్యానందం, తమ్మారపు లక్ష్మణ్, నల్లమోతు నాగేశ్వరరావు, పంచాయతీ గుమస్తా హెచ్ బాసు, కోసూరి ప్రసాద్, కోసూరి శ్రీను, సైదేశ్వరరావు, సైదా పెద్దోడు తదితరులు పాల్గొన్నారు,





## జంక్ ఫుడ్ వద్దు ఆరోగ్యం ముద్దు

- అంగన్వాడీలో చిన్నారులకు అవగాహన

**చింతకాని,ఏప్రిల్ 14,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని గడివి అంగన్వాడి సెంటర్ చిన్నారులకు జంక్ ఫుడ్ పై అవగాహన నిర్వహించారు.జంక్ ఫుడ్ వద్దు ఆరోగ్యం ముద్దు,చిరుధాన్యాలు తినుట పిల్లల ఆరోగ్యానికి మంచిది అని,జంక్ ఫుడ్ కు దూరం ఉంటూ పౌష్టికాహారం తినాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలోఅంగన్వాడి టీచర్ చంద్రకళ,ఆయా నాగమణి, పిల్లల తల్లిదండ్రులు,పిల్లలు, గ్రామస్తులు తదితరులు పాలుగోన్నారు.




## మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ డిసిపి శ్రీనివాస్ ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ

- సిబ్బందికి మార్గదర్శకాలు
- బాధితులతో ముఖాముఖి
- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పారదర్శకంగా సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచన

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 14 డిడి 9 వార్త**

రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్.శ్రీనివాస్ ఐపీఎస్, మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా స్టేషన్ రిసెప్షన్ వ్యవస్థ,ఫిర్యాదుల నమోదు విధానం,రిజిస్టర్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రజలకు కల్పిస్తున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే స్టేషన్‌కు వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడిన డిసిపి,వారి ఫిర్యాదులపై అధికారులు స్పందిస్తున్న తీరు,కేసుల పురోగతి గురించి ఆరా తీశారు.బాధితుల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన,చట్టపరంగా త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పారదర్శకంగా సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో మైలార్‌దేవ్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, డీఐ మక్సూద్ అలీ,ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి,ఏఎస్ఐ లాల్యా నాయక్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మరో పెళ్లికోసం పోలీస్ వేషం

- పెళ్లి పేరుతో కొంతమంది యువతులకు వల
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నకిలీ సీఐఎస్ఎఫ్ అధికారి అరెస్ట్
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 14 డిడి 9 వార్త**

అతనికి ముందే పెళ్లయింది. భార్య కూతురు ఉన్నారు. మరో పెళ్లి చేసుకునేందుకు పోలీస్ వేషం వేసుకుని మోసం చేస్తున్న యువకుడిని శంషాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో సిఐఎస్ఎఫ్ దుస్తులు ధరించి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గుర్తించిన సిఐఎస్ఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి తాను సిఐఎస్ఎఫ్‌లో పనిచేస్తున్నానని చెప్పుకుంటూ విమానాశ్రయం వద్ద యూనిఫామ్‌లో తిరుగుతూ ఫోటోలు దిగేవాడు.ఆ ఫోటోలను మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా యువతులకు,అలాగే మరో పెళ్లి చేసుకునేందుకు రెడీ అయి ఓ యువతి కుటుంబానికి పంపించి ప్రభుత్వ ఉద్యోగి అని నమ్మించే ప్రయత్నం చేసేవాడు.ఇప్పటికే వివాహితుడైన అతను మరో పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ మోసాలకు పాల్పడినట్లు వెల్లడైంది.కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగం ఉంటేనే పెళ్లికి ఒప్పుకుంటారని తెలుసుకుని పోలీస్ వేషం వేసుకున్నట్లు విచారణలో తేలింది.ఇప్పటివరకు కొంతమంది మహిళలను పెళ్లి పేరుతో మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ యూనిఫామ్ ధరించి ప్రజలను మోసం చేయడంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ ఘటనతో విమానాశ్రయం పరిసరాల్లో అప్రమత్తత పెంచిన పోలీసులు,ఇలాంటి మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇతన్ని అరెస్ట్ చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## పాన్ షాప్ దొంగల అరెస్ట్

- దొంగిలించిన సరుకులు, ఆటో,దొంగతనానికి ఉపయోగించిన సామాగ్రి స్వాధీనం
- నిందితులను కోర్టులో హాజరు పరిచిన పోలీసులు
- జ్యుడిషియల్ రిమాండ్ తరలింపు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 14 డిడి 9 వార్త**

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పాన్ షాప్‌ను పగులగొట్టి దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన సరుకులు,దొంగతనానికి ఉపయోగించిన పరికరాలు ఆటోను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఏప్రిల్ 13 ఉదయం లక్ష్మిగూడ తాండా గరం హోటల్ వద్ద ఉన్న తన పాన్ షాప్ తాళం విరగొట్టి అందులోని పాన్ సామగ్రి ఎత్తుకెళ్లారని యజమాని సోహైల్ పాషా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.అరెస్ట్ చేసిన వారిలో అజర్ ఖాన్(35)షేక్ ఫిరోజ్ (21)ఉన్నారు. వీరు దొంగతనానికి ఉపయోగించిన ఆటో (టీఎస్ 13 యుబి 7757)తో పాటు పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ సుధాకర్ నేతృత్వంలో ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, డీఐ మక్సూద్ అలీ,డీఎస్ఐ రమణ,క్రైమ్ బృందం ఈ కేసును చేధించింది. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.




## అంబేద్కర్ ఆశయాలలో భాగస్వాములవుదాం

- చిలక నాగరాజు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి

**బోనకల్,ఏప్రిల్ 14,(డీడీ9 వార్త):**

మండలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు పలు గ్రామాలలో ఘనంగా జరిగాయనీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజ్ అన్నారు, జానకిపురం గ్రామంలో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్న చిలక నాగరాజ్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి ,భారత రాజ్యాంగ రచన నిర్మాత, భారతరత్న. అంబేద్కర్ గొప్ప సంఘసంస్కర్త దళిత బలహీన వర్గాల పక్షాన వారికి సమాజంలో ఉండవలసిన పౌర హక్కులు అంటరానితనం ఆర్థిక అసమానతలు మత విశ్వాసాలు అసమానతలు నిమ్న జాతుల ఉద్ధరణకు పాటుపడ్డారు. జానకిపురం, కలకోట, బోనకల్, రావినూతల, రాయన్నపేట, మోటమర్రి పలు గ్రామాలలో మంగళవారం అంబేద్కర్ 135 వ జయంతి జరుపుకోవడంతోపాటు మహనీయుడు సూచించిన మార్గంలో నడవటం, గ్రామం నుండి మొదలుకొని దేశం వరకు నేడు నిమ్న జాతులపై వివక్షతను చూపటం జరుగుతుంది దేశంలో కుల నిర్మూలన చేయాలని సమ సమాజాన్ని స్థాపించాలని భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉండాలని తెలియజేస్తూ సమాజంలో అంబేద్కర్ చూపినట్టు వంటి మార్గంలో నడవాలని కోరారు,ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కోట హనుమంతరావు, గంగాదరి భూపతిరావు,రుద్రపోగు శ్రీను, పంది రమేశ్,తాటికొండ వెంకటరత్నం, తోటపల్లి చిన్న సైదులు, తోటపల్లి సాల్మన్ రాజ్, మంద వినోద్, తోటపల్లి రాజశేఖర్, మర్రి కరణం, మాగి ముఖేష్,కోట కొండ, యంగల వెంకన్న, మంద అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్రహీంపూర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**జనగామ ఏప్రిల్14(డిడి 9వార్త )బ్యూరో**

జనగామ జిల్లా, ఇబ్రహీంపూర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీశ్ చంద్ర రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మసిపెల్లి లింగాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు డా. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ గారి ఆలోచనలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రజలు తమ జీవితాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ చింత నరేష్, వార్డు సభ్యులు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గ్యార నాగరాజు,కాసర్ల లక్ష్మయ్య పుల్ల రవి, గ్యార నాగరాజు (Fa),మేడిపల్లి నరేష్ సహా గ్రామానికి చెందిన ప్రముఖులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**బోనకల్,ఏప్రిల్14,(డీడీ9 వార్త):**

బోనకల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తోటపల్లి స్వామి,ఉపాధ్యక్షులు జ్వాల నాయక్ ల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు,కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురుగా సినిమా హాల్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ అభిమానులు,యూత్ సంఘాలు ,వివిధ కుల సంఘాలు,ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా,సామాజిక న్యాయం,సమానత్వం,స్వేచ్ఛ, సోదరభావం ఆదర్శాలను స్థాపించిన మహానుభావుడు. ఆయన ఆదర్శాలు ఇప్పటికీ ప్రజలందరికీ మార్గదర్శకంగా ఉన్నాయని పలువురు అన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి

**కన్నాయిగూడెం ఏప్రిల్ 14(డిడి9 వార్త)**

కన్నాయిగూడెం మండల కేంద్రంలో గల గూరేవుల గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి జరుపుకోవడం జరిగింది. ముఖ్య అతిథిగా వాసం పెల్లి రమేష్ హాజరై మాట్లాడుతూ డా.,బాబాసాహెబ్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించడం జరిగింది. భారతీయ న్యాయవాదిగా ఆర్థిక శాస్త్రవేత్తగా రాజకీయనేతగా సంఘసంస్కర్తగా అంటరానితనం కుల నిర్మాణం కోసం ఎంత కృషి చేశాడు స్వతంత్ర భారతదేశ మొట్ట మొదటి కేంద్ర శాఖ మంత్రిగా చేశాడు కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి హెచ్ డి లండన్ విశ్వవిద్యాలయం నుండి డీఎస్సీ డాక్టర్ పట్టా పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించాడు 1990 లో భారత ప్రభుత్వం అత్యంత పురస్కారం భారత రత్న మరణాంతరం ప్రకటించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ బీసీ అణగారిన వర్గాల ఆశాజ్యోతి గా పేరు పొందాడు అంబేద్కర్ జయంతి చేయడం గర్వంగా ఉందని వారన్నారు. జయంతి రోజు పూలమాలవేసి వర్ధంతి రోజు మరోసారి సరస్మరించుకొని పూలమాలలు వేసే మనం సమాజంలో వారు చేసిన మంచి పనుల్లో పాలుపంచుకోవాలని అన్నారు ఇప్పుడున్న సమాజంలో యూత్ పెడదారిన పడుతున్నారు వారికి అంబేద్కర్ గొప్పతనాన్ని గురించి అవగాహన చేసుకురావాలి అంబేద్కర్ జయంతి రోజు తోనే ఒక మంచి పని చేయుటకు మనందరం కృషి చేయాలి అన్నారు. దుర్గం సమ్మక్క మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు చాలా గొప్పవి మనమందరం అంబేద్కర్ చరిత్ర చదవాలి అన్నారు గూరేవుల గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబాల సౌజన్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అంబేద్కర్ ఉద్దేశించి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక అంబేద్కర్ పుట్టాలి ప్రపంచానికి వెలుగునిచ్చే దిశగా తయారవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల భాస్కర్. వాసం పెల్లి లక్ష్మీనారాయణ. సతీష్ కొంచర్ల ముత్తయ్య వాసం పెల్లి సాంబశివరావు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నరేందర్, నరసింహారావు, అంబాల ప్రశాంత్, వాసం పల్లి శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

- **ప్రజ్ఞాపూర్ లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి**
- **సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తుంకుంట ఆంక్ష రెడ్డి**

**గజ్వేల్ ప్రతినిధి ( డి డి 9 వార్త) :**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వ్యక్తిత్వం ఆలోచన విధానం ఒక కాలానికి ఒక వర్గానికి ఒక పరిమితమైనది కాదని నిజమైన అంబేద్కర్ అంటే అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యవంతమైనదని సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి అన్నారు. ప్రజ్ఞాపూర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పెరక పరశురాం పెరిక నాగరాజ్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచ మేధావి రాజకీయవేత్త ఆర్థిక సామాజికవేత్త అని కొనియాడారు. అంబేద్కర్ ఆలోచన విధానాలు ఒక వర్గానికో పరిమితమైనవి కావని నిజమైన అంబేద్కర్ జమంటే అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యమైన బాబాసాహెబ్ తాత్వికత చాలా లోతైనదని అంబేద్కర్ దృష్టిలో నిజమైన స్వేచ్ఛ అంటే రాజకీయం స్వాతంత్ర్యం మాత్రమే కాదని ఆర్థిక స్వేచ్ఛ కూడా మనిషిని మనిషిగా గౌరవించని ఏ వ్యవస్థ అయినా కూకటి వేళ్ళతో సహా పెగిలించేయాలని ఆయన నమ్మేవారని తన జీవితాంతం హేతుబద్ధత మానవత్వం అనే రెండు కళ్ళని నమ్మకున్నారు. అంబేద్కర్ అంటే నిరంతరం అధ్యయనం అలుపెరుగని పోరాటం ఆయన యువతకు చదువు సమీకరించి పోరాడు అనే నినాదం ఇచ్చారని ప్రపంచంలోనే అత్యంత విద్యను అభ్యసించి దేశంలో అత్యున్నత పదవులను అధిరోహించినప్పటికీ తన మూలాలను తన వారు పడుతున్న బాధలను ఆయన మర్చిపోలేదు వ్యక్తిగత ఎదుగుదల కన్నా సామాజిక ప్రయోజనమే మిన్న అని చాటి చెప్పిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సమీర్ పీర్లపల్లి సర్పంచి ఓం ప్రకాష్ మాజీ కౌన్సిలర్ కనకయ్య చిన్న పెద్ద గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.




# రాజ్యాంగ ఫలాలుదేశ ప్రతి పౌరులకుఅందాలి,,,,!!

- **ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియే షన్ కమిటి,,,**
- **అంబేద్కర్ కు ఘనంగా నివాళులు,,,**
- **తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి,,,**

**ఏటూరునాగారంక్రైం**
**డిడి9 వార్త ఏప్రిల్ 14**

భారత రాజ్యాంగ రూపశిల్పి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విధంగా ములుగు ఏటూరునాగారం ఏరియాలలొ చేయలని పిలుపునిచ్చారు ఏటూరునారం ఏరియలలొ పర్యటించారు అంబేద్కర్ ప్రాంగణంలో నేడు ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలు అంబేద్కర్ అభిమానులు వివిధ రాజకీయ పార్టీలు అందరూ హాజరైనారు ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దుప్పటి సుందరం గారి అధ్యక్షతన అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జరుగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో ఘన సత్కారం చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నతమైన అతిపెద్దదైన రాజ్యాంగాన్ని మన భారతదేశానికి అందించారని భారత రాజ్యాంగం అమలై 75 సంవత్సరాలు గడిచినప్పటికిని భారత రాజ్యాంగం నేటికీ సమకాలీన సమాజానికి ఎంతో ఆదర్శవంతంగా సజీవంగా భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఉందని అంబేద్కర్ గారి దూరదృష్టి దాశనికత అందుకు నిదర్శనం అని భారత రాజ్యాంగం ఎప్పటికీ ఆయా కాలాలకు అనుగుణంగా రూపొందించబడిందని భారత దేశ పౌరులు స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంతో మెలుగుతూ హక్కులు బాధ్యతలు తెలియపరుస్తూ సజీవంగా ఎప్పటికీ ఉంటుందని ఈ సందర్భంగా భారత రాజ్యాంగ స్ఫూర్తిని ప్రస్ఫుటించారు నేటి సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుచున్నవని వాటి రూపుమాపాలంటే పాలకులు వారి చిత్తశుద్ధిని పరీక్షించుకోవాలని ప్రజలు తమ ఓటు విలువను తెలుసుకొని ఉన్నతమైన ఆలోచనలతో ప్రజా ప్రతినిధులను ఎంచుకోవాలని నవభారత నిర్మాణానికి ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ చెందిన ఓనపాకల రాజయ్య



గారు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భద్రయ్య హనుమకొండ జిల్లా అధ్యక్షులు రఘుపతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గౌర్ర విజయభాస్కర్ మొదలగువారు పాల్గొన్నారు



# రోడ్డు భద్రత కోసం పస్రా పోలీసుల ప్రత్యేక చర్యలు

**గోవిందరావుపేట, ఏప్రిల్ 14 ( డి డి 9 వార్త)**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పస్రా ,పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై జీబ్రా క్రాసింగ్ వద్ద రిఫ్లెక్టర్ మార్కింగ్‌లు ఏర్పాటు చేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా రోడ్డు సూచికలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాదచారులు తప్పనిసరిగా జీబ్రా క్రాసింగ్ ద్వారానే రోడ్డు దాటాలని సూచించారు. స్థానిక ప్రజలు ఈ చర్యలను అభినందిస్తూ, రోడ్డు భద్రతకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**గోవిందరావుపేట, ఏప్రిల్ 14 ( డి డి 9 వార్త)**

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఇంచార్జ్ ఎంపీడీవో, మమత నిర్వహించారు. అనంతరం సిబ్బంది మరియు హాజరైన వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# మునిగడప శ్రీ ముడుపుల ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న రాగుల రాజు ముదిరాజ్

- **ఘనంగా శ్రీ ముడుపుల ఎల్లమ్మ 10వ వార్షికోత్సవ వేడుకలు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి ( డి డి 9 వార్త) :**

జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో ఆదివారం శ్రీ ముడుపుల ఎల్లమ్మ తల్లీ 10వ వార్షికోత్సవ వేడుకలు దొమ్మాట నర్సింలు సునీత ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాసకులు దొమ్మాట నర్సింలు సునీత తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ పోరాట సమితి ఉపాధ్యక్షుడు రాగుల రాజు లు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దయతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆలయం వార్షికోత్సవ వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, గత నాలుగు రోజులుగా ఆలయ వేడుకలు కన్నుల పండుగగా భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, అమ్మవారి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు రొయ్యల కరుణాకర్, బిఎన్ఆర్ కె జిల్లా అధ్యక్షుడు నర్రా భిక్షపతి, భక్తులు, సభ్యులు, పురోహితులు దాతలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా అంబేద్కర్ జయంతి

**కన్నాయిగూడెం ఏప్రిల్ 14(డిడి9 వార్త)**

కన్నాయిగూడెం మండల కేంద్రంలో గల గూరేవుల గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి జరుపుకోవడం జరిగింది. ముఖ్య అతిథిగా వాసం పెల్లి రమేష్ హాజరై మాట్లాడుతూ డా.,బాబాసాహెబ్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించడం జరిగింది. భారతీయ న్యాయవాదిగా ఆర్థిక శాస్త్రవేత్తగా రాజకీయనేతగా సంఘసంస్కర్తగా అంటరానితనం కుల నిర్మాణం కోసం ఎంత కృషి చేశాడు స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి కేంద్ర శాఖ మంత్రిగా చేశాడు కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి హెచ్ డి లండన్ విశ్వవిద్యాలయం నుండి డీఎస్సీ డాక్టర్ పట్టా పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించాడు 1990 లో భారత ప్రభుత్వం అత్యంత పురస్కారం భారత రత్న మరణాంతరం ప్రకటించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ బీసీ అణగారిన వర్గాల ఆశాజ్యోతి గా పేరు పొందాడు అంబేద్కర్ జయంతి చేయడం గర్వంగా ఉందని వారన్నారు. జయంతి రోజు పూలమాలవేసి వర్ధంతి రోజు మరోసారి సరస్మరించుకొని పూలమాలలు వేసే మనం సమాజంలో వారు చేసిన మంచి పనుల్లో పాలుపంచుకోవాలని అన్నారు ఇప్పుడున్న సమాజంలో యూత్ పెడదారిన పడుతున్నారు వారికి అంబేద్కర్ గొప్పతనాన్ని గురించి అవగాహన చేసుకురావాలి అంబేద్కర్ జయంతి రోజు తోనే ఒక మంచి పని చేయుటకు మనందరం కృషి చేయాలి అన్నారు.దుర్గం సమ్మక్క మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు చాలా గొప్పవి మనమందరం అంబేద్కర్ చరిత్ర చదవాలి అన్నారు గూరేవుల గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబాల సౌజన్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అంబేద్కర్ ఉద్దేశించి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక అంబేద్కర్ పుట్టాలి ప్రపంచానికి వెలుగునిచ్చే దిశగా తయారవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల భాస్కర్. వాసం పెల్లి లక్ష్మీనారాయణ. సతీష్ కొంచర్ల ముత్తయ్య వాసం పెల్లి సాంబశివరావు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నరేందర్, నరసింహారావు, అంబాల ప్రశాంత్, వాసంపల్లి శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు





## మౌళి 'దొంగనా కొడుకు'

యూట్యూబ్ మరియు వెండితెరపై తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్న మౌళి #90s తో ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత లీడ్ రోల్ లో చేసిన లిటిల్ హార్ట్స్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. దాంతో మౌళికి ఆఫర్స్ వెల్లువెత్తాయి. కానీ మౌళి ఆచి తూచి అడుగులు వేస్తూ సినిమాలు చేస్తున్నాడు. తాజాగా మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు మౌళి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి 'దొంగ నా కొడుకు' అనే మాస్ అండ్ ఫన్నీ టైటిల్‌ను ఖరారు చేశారు.

సాధారణంగా సినిమాలకు క్లాస్ టైటిల్స్ లేదా గంభీరమైన పేర్లు పెట్టడం చూస్తుంటాం. కానీ 'దొంగ నా కొడుకు' అనే టైటిల్ వినగానే ఇది ఒక పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం అని అర్థమవుతోంది. మౌళి శైలికి తగ్గట్టుగా ఈ సినిమా కథాంశం కూడా చాలా వినూత్నంగా సరదాగా సాగిపోనుందని తెలుస్తోంది. ఈ టైటిల్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో సినిమాపై అప్పుడే హైప్ మొదలైంది. టాలీవుడ్‌లో పెద్ద సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే మైత్రీ మూవీ మేకర్స్ చిన్న చిత్రాలను కూడా ఎంతో రిచ్‌గా నిర్మిస్తుంటారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.



## ప్లీజ్ ఒక్క చాన్స్ ఇవ్వండి..

తెలుగులో మెంటల్ మదిలో, చిత్రలహరి వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, తన వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు కాస్త విరామం ఇచ్చింది. అయితే, ఇప్పుడు ఆమె మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నివేదా తన కెరీర్ జోరుగా సాగుతున్న సమయంలోనే బిజినెస్ మెన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడింది. అతనితో జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, 2023లో సినిమాలకు దూరం అయింది. అంతేకాకుండా తన ప్రియుడితో క్లోజ్‌గా దిగిన ఫొటోలను షేర్ చేస్తూ.. కాబోయే భర్తను పరిచయం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక పెళ్లి బంధంతో ఒక్కటికాబోతున్నట్లు కూడా హింట్ ఇచ్చేసింది. దీంతో అంతా పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోతుందని భావించారు.

ఈక్రమంలోనే.. విధి వైపరీత్యం వల్ల వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి ప్రియుడితో ఉన్న ఫోటోలన్నీ తొలగించి బ్రేకప్‌పై అందరికీ హింట్ ఇచ్చేసింది. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ కెరీర్ మీద దృష్టి పెట్టిందట. ప్రస్తుతం నివేదా మళ్లీ వెండితెరపై మెరవాలని ఆరాటపడుతోంది.



## నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది..

న్నడ ముద్దుగుమ్మ కయ్యదు లోహర్ ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. గత ఏడాది విడుదలైన 'డ్రాగన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ, ఇప్పుడు వరుసగా భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. కేవలం కన్నడలోనే కాకుండా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లోనూ క్రేజీ అవకాశాలను దక్కించుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. ప్రస్తుతం మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన 'ఐయామ్ గేమ్' అనే పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్‌లో కయ్యదు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను దుల్కర్ తన సొంత నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. 'ఆర్డీఎక్స్' వంటి భారీ హిట్‌ను అందించిన నహస్ హిదాయత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జూదం నేపథ్యంతో సాగే ఒక ఉత్సాహభరితమైన కథతో రూపొందుతోంది.

ఇదిలా ఉంటే.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కయ్యదు లోహర్ తన పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా, భిన్నంగా ఉంటుంది. గతంలో నేను చేసిన 'పల్లిచట్టంబి' చిత్రానికి ఇది పూర్తి భిన్నమైనది. అందుకే ఈ సినిమా కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ప్రేక్షకులు నన్ను రెండు వేర్వేరు రూపాల్లో, విభిన్న కోణాల్లో చూస్తారు. ముఖ్యంగా ఈ సినిమాలో నా విశ్వరూపం చూపించబోతున్నారు డైరెక్టర్" అంటూ గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేసింది. కేవలం దుల్కర్ మూవీనే కాకుండా, కయ్యదు ఖాతాలో మరి కొన్ని భారీ సినిమాలు కూడా ఉన్నాయి. కాగా.. "ఐయామ్ గేమ్' చిత్రంలో కతీర్, సంయుక్త విశ్వనాథన్, మిస్కిన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు జేక్స్ బెజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో నిండిన ఈ చిత్రం 2026 ఓనం పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



## నాని డేట్స్ కోసం దర్శకుల పోరాటం..
# ఆ లుక్ మారే వరకు 'రోమియో' రానట్టే!

నేచురల్ స్టార్ నాని ఇప్పుడు కేవలం కథలను మాత్రమే కాదు.. తన లుక్స్‌ను కూడా పూర్తిస్థాయిలో మార్చేస్తూ పాన్ ఇండియా రేంజ్‌లో అదరగొడుతున్నారు. అయితే, ఇదే ఇప్పుడు ఆయన తదుపరి చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్‌పై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ద ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమా విడుదల తేదీ మార్చి నుంచి ఆగస్ట్‌కు వాయిదా పడటంతో, చెప్పిన సమయానికి సినిమా వస్తుందా? లేదా? అన్న సందేహాలు ఇండస్ట్రీలో ఉన్నాయి.

కానీ హీరోయిన్ కయదు లోహర్ బర్త్ డే పోస్టర్‌లో ఆగస్ట్ 21 తేదీని మరోసారి మేకర్స్ నొక్కి చెప్పారు. ఇక ఈ సినిమా కోసం నాని తన జుట్టు, గడ్డాన్ని బాగా పెంచేశారు. ఆ లుక్ పూర్తి కాకుండా ఆయన మరో సినిమా సెట్స్‌లోకి వెళ్లడం అసాధ్యం. మరోవైపు, 'సాహో' ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో నాని చేయబోయే 'బ్లడీ రోమియో' స్క్రిప్ట్ ఇప్పటికే సిద్ధమైంది. క్యాస్టింగ్ కూడా పేపర్ మీద రెడీగా ఉన్నప్పటికీ.. నాని 'ప్యారడైజ్' నుంచి ఫ్రీ అయితేనే ఇతర ఆర్టిస్టుల కాల్ షీట్స్ తీసుకోవడానికి వీలవుతుంది. 'బ్లడీ రోమియో' ఒక గ్యాంగ్‌స్టర్ డ్రామా కావడంతో ఇందులో నాని లుక్ పూర్తి డిఫరెంట్‌గా ఉండబోతోంది. అంటే.. శ్రీకాంత్ ఓదెల సినిమాకు 'గుమ్మడికాయ' కొట్టే వరకు.. సుజిత్ సినిమా 'కొబ్బరికాయ' కొట్టలేదన్నమాట. ఒకప్పుడు నాని ఒకే లుక్‌తో రెండు సినిమాలు చేసేవారు, కానీ ఇప్పుడు సబ్జెక్ట్స్ డిమాండ్ మేరకు ఒక్కో సినిమాకు ఒక్కో మేకోవర్ అవసరమవుతోంది. సో.. 'ప్యారడైజ్' షూటింగ్ ఎంత త్వరగా పూర్తయితే, 'బ్లడీ రోమియో' అంత త్వరగా పట్టాలెక్కుతుంది.






## మరోసారి తారక్‌తో జోడీ కట్టనున్న
# ఆలియా భట్

గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ యాక్షన్ చిత్రం డ్రాగన్ పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ హైవోల్టేజ్ యాక్షన్ సాగాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక కీలక పాత్ర కోసం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంలో ఎన్టీఆర్ సరసన ఆలియా భట్ నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు మళ్ళీ ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ కోసం ఆమె పేరు వినిపిస్తుండటంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఒకవేళ ఆలియా ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఈ సినిమాకు పాన్‌ఇండియా స్థాయిలో మరింత క్రేజ్ రావడం ఖాయం. 'కేజీఎఫ్', 'సలార్' వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కోసం ఒక పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ సినిమాలో ప్రతి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని అందుకే ఆలియా వంటి టాలెంటెడ్ నటిని ఎంచుకోవాలని మేకర్స్ భావిస్తున్నారట. ప్రశాంత్ నీల్ కథకి అలియా ఆల్మోస్ట్ ఒకే చేసిందని త్వరలోనే దీనిపై చిత్ర బృందం నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



## లోకల్ ఛానల్‌లో 'జననాయగన్'.. యజమాని అరెస్ట్

విజయ్ నటించిన 'జన నాయగన్'కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే దీని పైరసీ సోషల్ మీడియాలో లీక్ కాగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో దిగ్భ్రాంతి కలిగించే విషయం బయటకు వచ్చింది. ఇంకా విడుదల కూడా కాని ఈ చిత్రాన్ని కోయంబత్తూరులోని ఓ లోకల్ ఛానల్‌లో ప్రసారం చేయడం షాక్‌కు గురిచేస్తోంది.

ఏప్రిల్ 10న 'జననాయగన్' లీక్ అయిందని చిత్రబృందం గుర్తించింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు సైబర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇదిలాఉండగా.. ఏప్రిల్ 11న కోయంబత్తూర్‌లోని కొన్ని ప్రాంతాల్లోని లోకల్ ఛానల్స్‌లో ఈ సినిమాను ప్రదర్శించారు. ఈ విషయం తెలుసుకున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకులు చిత్ర ప్రసారాన్ని నిలిపివేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఛానల్ యాజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటికే పూర్తి సినిమా ఛానల్‌లో ప్రసారం అయినట్లు టీవీకే నేతలు తెలిపారు.

మరోవైపు ఈ సినిమా లీక్‌పై దర్యాప్తు వేగవంతంగా జరుగుతోంది. సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసింది. ఎడిటింగ్ విభాగం నుంచి సినిమా లీక్ అయినట్లు వచ్చిన వార్తలను ఎడిటర్స్ యూనియన్ ఖండించింది. ఎడిటర్ ప్రదీప్ ఇ.రాఘవ్‌కు ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టత ఇచ్చింది. ఈ ఘటనలో బాధ్యులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని సినీ ప్రముఖులు డిమాండ్ చేస్తున్నారు.



## విక్రమ్ – శంకర్ మళ్ళీ కలుస్తున్నారు ఈసారి
## అదిరిపోయే కమర్షియల్ ప్లాన్!

2016లో వచ్చిన ఇంకొక్కడుతో విక్రమ్ , ఆనంద్ శంకర్ కాంబినేషన్ సూపర్ హిట్ అందుకుంది. నయనతార, నిత్యామీనన్ హీరోయిన్స్ గా నటించారు. స్పై థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సినిమా విక్రమ్‌ను డ్యూయల్ రోల్‌లో కొత్తగా ప్రెజెంట్ చేసింది. దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ ఆనంద్ శంకర్, విక్రమ్ జోడీ కలవడం ఫ్యాన్స్‌లో హైప్ పెంచుతోంది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం, వీళ్ల కాంబోలో రాబోతున్న కొత్త సినిమా ఒక ఫుల్ కమర్షియల్ ఎంటర్టైనర్‌గా ప్లాన్ చేస్తున్నారు.



మ్యూజిక్ డైరెక్టర్‌గా హరీష్ జయరాజ్ పేరు వినిపిస్తుండగా మే నెలలో షూటింగ్ స్టార్ట్ చేసి ఈ ఏడాది చివర్లో రిలీజ్ చేసే టార్గెట్ పెట్టుకున్నారు. ఇక ఈ ప్రాజెక్ట్ బడ్జెట్ విషయంలో కూడా భారీ చర్చలు జరిగాయి. మొదట 60-65 కోట్లుగా ప్లాన్ చేసిన బడ్జెట్‌ను చివరికి 50-55 కోట్ల మధ్యలో ఫిక్స్ చేశారు. విక్రమ్ కూడా తన రెమ్యునరేషన్‌ను తగ్గించి 25 కోట్లకు ఒప్పుకొని, మిగతాది ప్రాఫిట్ షేర్‌గా తీసుకునేలా డీల్ ఫైనల్ అయ్యింది. తంగలాన్‌తో చేసిన ఎక్స్‌పెరిమెంట్ ఆశించిన ఫలితం ఇవ్వకపోయినా, చియాన్ విక్రమ్ వెంటనే వీర ధీర శూరతో రీఎంట్రీ ఇచ్చాడు. దాదాపు 55 కోట్ల బడ్జెట్‌తో వచ్చిన ఈ యాక్షన్ ఫిల్మ్ వరల్డ్‌వైడ్‌గా 65 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసినా, ఫుల్ ప్రాఫిట్స్ మాత్రం అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు విక్రమ్ స్ట్రాటజీ మార్చి, సేఫ్ కమర్షియల్ జానర్ వైపు మళ్లడం ఇంట్రెస్ట్ గా మారింది. ఇక ఆనంద్ శంకర్ తో హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరిగాయి. ఏప్రిల్ 17న అనౌన్స్‌మెంట్ వచ్చే ఛాన్స్ ఉండటంతో ఫ్యాన్స్ ఎగ్జైట్‌గా వెయిట్ చేస్తున్నారు.